క్లుప్తంగా

మానవ సంబంధాలు కీలకం
ఎమ్మెల్యే పేర్ని నాని



మచిలీపట్నంటౌన్: రాజకీయాల్లో మానవ సంబంధాలు అత్యంత కీలకమని, అప్పుడే ప్రజా సమస్యలను ఆకళింపు చేసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసే వీలు కలుగుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. నియోజకవర్గంలోని అర్బన్, రూరల్ ప్రాంతాల కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్ల శిక్షణ కార్యక్రమం స్థానిక విజయవాడ రోడ్డులోని గోల్డ్ కన్వెన్షన్‌హాల్‌లో ఆదివారం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలు, ఆశయాలను ప్రజలకు వివరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అలుపెరగక పనిచేయాలని సూచించారు. డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్లు చిటికిన నాగేశ్వరరావు, గూడవల్లి నాగరాజు, శీలం బాబ్జీ, రూరల్ కన్వీనర్లు వాలిశెట్టి రవిశంకర్, శొంఠి ఫరీద్, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జీలు, సర్పంచులు పాల్గొన్నారు.

నేడు కృష్ణా కో-ఆపరేటివ్ బ్యాంక్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

మోపిదేవి: కృష్ణా కో-ఆపరేటివ్ బ్యాంక్ భవన నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు సోమవారం ఉదయం 8 గంటలకు మోపిదేవి గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో శంకుస్థాపన చేస్తారని సర్పంచ్ నందిగం మేరీరాణి తెలిపారు. శంకుస్థాపన అనంతరం గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహిస్తారన్నారు.

గోడౌన్‌కు..

రావివారిపాలెం నూకాలమ్మ తల్లి చెరువు గట్టున పీఏసీఎస్ ఆధ్వర్యంలో గోడౌన్ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే రమేష్‌బాబు సోమవారం శంకుస్థాపన చేస్తారని పీఏసీఎస్ చైర్‌పర్సన్ రావి రామప్రసాద్ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

పెదకళ్లేపల్లి(మోపిదేవి): చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి తీవ్ర గాయాలై మంచానికే పరిమితమైన ఉయ్యూరు నరసింహారావుకు అవనిగడ్డ శ్రీ రామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్‌కిషోర్ నాయుడు రూ. 7 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పెదకళ్లేపల్లిలో ఇంటి వద్ద బాధితుడిని ఆదివారం కలిసి ధైర్యం చెప్పారు. కేతరాజు శ్రీనివాసరావు, పలకా శ్రీనివాస్, బాదర్ల లోలాక్షుడు నాయుడు, కూరేటి జగన్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళాలు



కోసూరువారిపాలెం(మోపిదేవి): కోసూరువారిపాలెం కృష్ణానది గర్భంలో నూతనంగా నిర్మించిన బాల శివశంకర భగవాన్ ఆలయ అభివృద్ధికి భక్తుడు కోసూరు రవి రూ. 50 వేలు విరాళాన్ని ఆలయ ధర్మకర్త గుడిసేవ విజయలక్ష్మికి ఆదివారం అందించారు. గుంటూరు జిల్లా కొల్లూరుకు చెందిన మరో భక్తుడు నూకల రాంబాబు ఆలయ అభివృద్ధికి రూ. 5 వేలు అందజేశారు.

72 మందికి వైద్య పరీక్షలు



కోడూరు: కోడూరు పంచాయతీ, విజయవాడ సెంటిని హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచి వెన్నా షైనీ ప్రారంభించారు. 72 మంది రోగులకు ఉచితంగా ఈసీజీ, 2డీ ఎకో, బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించి మందులు అందజేశారు. ఉప సర్పంచ్ ఇంకొల్లు మురళి, వార్డు సభ్యుడు వెన్నా ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

ఉంగుటూరు: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఆదివారం రమేష్ హాస్పిటల్స్, ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని వెంకయ్యనాయుడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శారీరక శ్రమతో పాటు మంచి ఆహార అలవాట్లను, క్రమబద్ధమైన జీవన శైలిని అలవాటు చేసుకోవాలని సూచించారు. హైస్కూల్ విద్యలో ఆరోగ్య సమస్యలు, చిన్న చిన్న వైద్య పరిష్కారాలను బోధన సబ్జెక్టుగా చేర్చాలన్నారు. అనంతరం వైద్య శిబిరంలో రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. సుమారు 420మందికి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ పరదేశి, శరత్‌బాబు, ప్రముఖ కార్డియాలజిస్ట్ రమేష్ బాబు, ఊపిరితిత్తుల వైద్య నిపుణులు, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు



దర్గాను సందర్శించి పూజలో పాల్గొన్న పేర్ని కిట్టు

జవ్వారుపేట టిక్యాలోని హజ్రత్ సయ్యద్ షా షరీఫ్ ఖలందర్ బాబా దర్గా ఉరుసు మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారం కూడా కొనసాగాయి. బాబా దర్గాను వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) సందర్శించి సందల్ (గంధం) సమర్పించారు. ఆదివారం చిరాగా - బయాన్ (దీపారాధన) నిర్వహించారు. ఈ నెల 19వ తేదీ ఆదివారం దేగ్ (అన్నదానం) జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, కార్పొరేటర్లు మీర్ అస్గర్ అలీ, గోపిశెట్టి సతీష్, వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు షేక్ మొహమ్మద్ సాహెబ్, షేక్ జలీల్, యూనుస్, రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

–మచిలీపట్నంటౌన్

భక్తులతో కళకళ



మోపిదేవి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం ఆదివారం భక్తులతో కళకళలాడింది. ఉదయమే ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్ర వ్యాప్తంగా వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

–మోపిదేవి

నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన పాలకవర్గ సభ్యులు

అవనిగడ్డ: ది మండల పరిషత్ టీచర్స్ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ సొసైటీ నూతన పాలకవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మూడో సారి అధ్యక్షుడిగా ఎన్నికైన జీవీఎస్ పెరుమాళ్లు, ఉపాధ్యక్షుడు లంకే వెంకటేశ్వరరావు, కార్యదర్శి మన్నే ప్రేమ్‌చంద్, కోశాధికారి యలవర్తి వెంకటరత్నారావుతో పాటు మరికొందరు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు జీవీఎస్ పెరుమాళ్లు మాట్లాడుతూ 40 ఏళ్ల చరిత్రలో సొసైటీ పాలకవర్గం ఏకగ్రీవం కావడం తొలిసారని, తమపై నమ్మకం ఉంచి ఎన్నుకున్న సభ్యులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు సభ్యులకు మరిన్ని ప్రయోజనాలు కలిగించే కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో డెమోక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి. శ్రీను, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. ఉమామహేశ్వరరావు, కోడూరు ఎంఈఓ టీవీఎం రాందాస్, డెమోక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టీవీ రాంబాబు, నాయకులు భరత్, ఆరేపల్లి నాగేంద్ర, నాలుగు మండలాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

నందం కుటుంబ సభ్యులకు పరామర్శ



వెంకటేశ్వరరావును పరామర్శిస్తున్న కిట్టు, రాజీవ్

పెడన: ప్రముఖ కలంకారీ, చేనేత పారిశ్రామికవేత్త నందం వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పలువురు పరామర్శించారు. వెంకటేశ్వరరావు సతీమణి సరస్వతి (83) ఆదివారం ఉదయం మృతిచెందారు. ఆమెకు భర్త, ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. వీరి కుమారుడు నందం మనోజ్ వర్ధమాన సినీ నటుడు. సరస్వతి మృతికి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) సంతాపం తెలిపారు. జోగి రాజీవ్, పేర్ని కృష్ణమూర్తి(కిట్టు)లు వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి, కౌన్సిలర్లు గంగయ్య, గోపీ, పలువురు కలంకారీ, చేనేత వ్యాపార ప్రముఖులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

దేవుడి ప్రభ ఏర్పాటుకు సన్నాహాలు



గ్రామంలో మండపం వద్ద దేవుడి ప్రభను సిద్ధం చేస్తున్న గ్రామస్తులు

పెనమలూరు: యనమలకుదురులోని పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో దేవుడి ప్రభ ఏర్పాటుకు గ్రామస్తులు రంగం సిద్ధం చేస్తున్నారు. గ్రామంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు. మహాశివరాత్రి 18వ తేదీన పెద్ద ఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు చేపట్టారు. ఇందులో భాగంగా పండుగ నాడు గ్రామంలో భారీ ఎత్తున ప్రభోత్సవం చేయనున్నారు. గ్రామంలో దేవుడి ప్రభ ప్రదర్శన ఆకట్టుకుంటుంది. మొత్తం 50 ప్రభలు కొండ చుట్టూ ప్రదర్శిస్తారు. దేవుడి ప్రభకు బహిరంగ వేలంపాట నిర్వహిస్తారు. దేవుడి ప్రభ రాతి చక్రాల పై ఏర్పాటు చేస్తారు. తెలంగాణ నుంచి వెదురు కర్రలు తీసుకు వచ్చారు. గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేసి దేవుడి ప్రభ సిద్ధం చేయడానికి పనులు ప్రారంభించారు. పండగ రోజు సాయంత్రం 6 గంటల నుంచి ప్రభోత్సవం ఉంటుంది. ప్రభ ప్రతిష్ఠ 18వ తేదీ ఉదయం 11 గంటలకు జరుగుతుంది.

ప్రశాంత వాతావరణంలో ప్రభోత్సవం నిర్వహించండి

పెనమలూరు: యనమలకుదురులో మహాశివరాత్రి ఉత్సవాల్లో ప్రభోత్సవం ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలని డీఎస్పీ విజయ్‌పాల్ అన్నారు. గ్రామంలోని కల్యాణమండపంలో ఆదివారం గ్రామస్తులకు, ప్రభ నిర్వాహకులకు ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామంలో ఈ నెల 18వ తేదీన జరిగే ప్రభోత్సవంలో 34 ప్రభలకు అనుమతించామన్నారు.

ప్రతీ ప్రభకు నిర్వాహకులు ఐదుగురు చొప్పున బాధ్యత వహించాలన్నారు. దేవాలయ అధికారులు ఇచ్చిన సీరియల్ ప్రకారమే ప్రభలు కొండ చుట్టు ప్రదక్షిణ చేయించాలని సూచించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహాశివరాత్రి విజయవంతంగా నిర్వహించడానికి అందరు సహకరించాలని కోరారు. సమావేశంలో సీఐ ఆర్.గోవిందరాజు, ఆలయ ఈవో గంగాధరరావు, ప్రధాన అర్చకుడు సాగర్, ప్రభ నిర్వహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్నోభితం



కృత్తివెన్ను మండలం గాంధీనగరం వద్ద జాతీయ రహదారిపై లైట్లు వేసుకుని వెళుతున్న ఆటో

దట్టంగా కమ్ముకున్న పొగమంచు ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదాన్ని పంచింది. ఆదివారం ఉదయం గ్రామాలపై మంచుదుప్పటి పరుచుకుంది. ఉదయం 8 గంటలకు సైతం మంచు కురిసింది. వాహన చోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక పోవడంతో ఉదయం 8 గంటలకు సైతం లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు.

– కృత్తివెన్ను

ఎవరెన్ని యాత్రలు చేసినా మళ్లీ జగనే సీఎం

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- వెలువోలులో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

వెలువోలు (చల్లపల్లి): లోకేష్ పాదయాత్ర, పవన్ కల్యాణ్ బస్సు యాత్ర ఇలా ఎవరెన్ని యాత్రలు చేసినా మళ్లీ ఈ రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే సీఎం అవుతారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం యార్లగడ్డ గ్రామ సచివాలయం పరిధిలోని వెలువోలులో నిర్వహించారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు బీసీ కాలనీ, ఎస్సీ కాలనీల్లో 200 ఇళ్లకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పేదల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు కూడా వేగవంతం చేస్తామని తెలిపారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ఓడించాలని చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసి చేస్తున్న కుట్రలు సాగవన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసి చేస్తున్న ఏ ఒక్క ప్రయత్నం కూడా సఫలం కావడంలేదన్నారు. పేదల ఆశీస్సులు, అండదండలతో మళ్లీ ఈ రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మోపిదేవి ద్వారకానాథ్, లక్ష్మీపురం సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ శీరం వెంకట సత్యనారాయణ (నాని), వైఎస్సార్ సీపీ నాయకులు వేములమడ సతీష్, వేముల శ్రీనివాసరావు, గ్రామ కన్వీనర్ కుంపటి గంగాధరరావు, తుమ్మల వెంకటేశ్వరరావు, బొందలపాటి లక్ష్మీ, కుటుంబరావు, మద్దాల వీరాస్వామి, జీఎస్‌సీ మండల కన్వీనర్ యడ్ల జగదీష్, ఏఎంసీ డైరెక్టర్ అబ్దుల్ అర్షద్, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సత్తా చాటిన 'ఈడుపుగల్లు' స్విమ్మర్లు



పతకాలు సాధించిన స్విమ్మర్లు

కంకిపాడు: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఈడుపుగల్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఈతకొలనులో నిర్వహించిన స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో ఈడుపుగల్లు స్విమ్మింగ్‌పూల్ స్విమ్మర్లు పతకాలు సాధించారు. ఈ నెల 11, 12 తేదీల్లో ఈడుపుగల్లు స్విమ్మింగ్‌పూల్‌లో 66వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలు, క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. పోటీల్లో అండర్-17 విభాగంలో ఈడుపుగల్లుకు చెందిన బిళ్లా హర్షిత 200 మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో బంగారు పతకం, కె.వర్షంత్ నాయుడు 50 మీటర్ల ఫ్రీస్టైల్‌లో కాంస్య పతకం సాధించారు. అండర్-14 విభాగంలో బిళ్లా హర్షశ్రీ 400 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో బంగారు పతకం, 100 మీటర్ల బటర్ ఫ్లైలో బంగారు పతకం సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఆదివారం జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఝాన్సీలక్ష్మి అభినందించారు.

నిత్యావసరాలు పంపిణీ

పెనమలూరు: వణుకూరులో పేద కుటుంబానికి ఆదివారం నిత్యావసర సరుకులు అందజేశారు. లయన్స్ క్లబ్ సభ్యుడు, ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ రావి సురేష్‌బాబు ఆధ్వర్యంలో వణుకూరు గ్రామంలో భాగ్యలక్ష్మికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సురేష్‌బాబు మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాలుగా తాను అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించానన్నారు. పేదల కోసం వైద్య శిబిరాలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జాస్తి శ్రీనివాసరావు, కార్యదర్శి కిరణ్‌కుమార్, గ్రామస్తులు సుంకర రాజా, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



మచిలీపట్నంటౌన్: గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2023 సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆదివారం ఆవిష్కరించారు. స్థానిక గోల్డ్ కన్వెన్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించి ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పి. రత్నం, ఉపాధ్యక్షుడు కలపాల దినేష్‌తేజ, కోశాధికారి యడ్ల నాగరాజు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి విజయనాయక్, జిల్లా నాయకులు రఘు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐ శివనాగేశ్వరరావు మృతి



పెడన: పెడన పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ బి. శివనాగేశ్వరరావు (53) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సొంతూరు మచిలీపట్నం పరాసుపేటలోని అన్నదమ్ములున్న ప్రాంతంలో ఇంటి నిర్మాణ పనులు ఇటీవల ప్రారంభించారు. ఇంటి నిర్మాణ పనులు చూస్తూ అన్నదమ్ముల వద్ద ఉన్న ఆయనకు ఆదివారం ఉదయం గుండె పోటు వచ్చింది. ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. శివనాగేశ్వరరావు మృతికి జిల్లా ఎస్పీ జాషువా, ఏఎస్పీ ఎన్. వెంకట రామాంజనేయులు, మచిలీపట్నం డీఎస్పీ మాసూంబాషా, పెడన సీఐ ఎస్. ప్రసన్న వీరయ్యగౌడ్, ఎస్ఐ వి. రవిచంద్రకుమార్ సంతాపం తెలిపారు.

మైనర్ అదృశ్యంపై కేసు

పెనమలూరు: తాడిగడపలో బాలిక అదృశ్యంపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప శ్రీనివాసనగర్‌కు చెందిన పిల్లి శివలక్ష్మి పటమటలంక పాఠశాలలో పని చేస్తున్నారు. ఆమె భర్త నాగేంద్ర కూలి పనులు చేస్తాడు. ఆమె కుమార్తె (17) చదువుమాని ఇంట్లో ఉంటోంది. శివలక్ష్మి కుమార్తె శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఘటనపై తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

సామాజిక బాధ్యతగా పర్యావరణ పరిరక్షణ

గన్నవరం: పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా ప్రతిఒక్కరూ గుర్తించాలని మత్స్యకార సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల సురేష్ పిలుపునిచ్చారు. స్థానిక ఎస్సీ కాలనీలోని మత్స్యకార సహకార సంఘం భవనం ఆవరణలో ఆదివారం సంఘ సభ్యులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. సురేష్ మాట్లాడుతూ వాతావరణ కాలుష్యంతో సమస్త జీవకోటి మనుగడ ప్రమాదకరంగా మారిందన్నారు. దీన్ని అధిగమించడానికి మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతల చేపట్టాలని కోరారు. సంఘం ఉపాధ్యక్షులు నిడమర్తి రామారావు, కార్యదర్శి జ్యోతి రంగారావు, డైరెక్టర్లు తిరివీధి ఆశీర్వాదం, మునేష్, మోటుపల్లి సుబ్బారావు, రంగారావు, శ్రీనివాసరావు, భిక్షాలు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు పూజలు

కృత్తివెన్ను: కృత్తివెన్నులోని సాయిబాబా మందిరం వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భక్తులు బాబావారిని దర్శించుకుని పూజలు చేశారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. మంగళవారం ఆలయం వద్ద అన్నసమారాధన జరుగుతుందన్నారు.